క్లుప్తంగా

వేమవరం
పాండురంగస్వామికి పూజలు



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాభాయి సహిత పాండురంగ స్వామి దేవాలయంలో బుధవారం ప్రాతఃకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భాద్రపద మాసం శుక్ల పరివర్తన ఏకాదశిని పురస్కరించుకుని పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు ధారా నారాయణమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పాఠశాలకు బీరువా అందజేత



భట్టిప్రోలు: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన భట్టిప్రోలులోని మండల పరిషత్ ప్రాథమిక (బీఆర్) పాఠశాలకు గ్రామానికి చెందిన మద్దుల సోమశేఖర్ ఆర్థిక సహకారంతో రూ.10 వేలు వ్యయం చేసే ఐరన్ బీరువాను ఎంఈవో నీలం దేవరాజు చేతుల మీదగా బుధవారం అందజేశారు. ఎంఈవో దేవరాజు మాట్లాడుతూ దివంగత మద్దుల భాస్కర్ జ్ఞాపకార్థం, ఆయన సతీమణి ఉదయశ్రీ, కుమారుడు సోమశేఖర్ బీరువా అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల సుసంపన్నానికి దాతల సహకారం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ హుస్సేన్, ఉపాధ్యాయులు వై.రమాకుమారి, ఆత్మూరి సుబ్బారావు, వాణిశ్రీ, విశ్రాంత ఉపాధ్యాయులు, హోమియో క్లినిక్ వైద్యులు కూచిమంచి శివరామకృష్ణ పాల్గొన్నారు.

టీఎంరావు హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు



భట్టిప్రోలు: సత్యసాయి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులకు పనే(వృత్తే) దైవం (డ్యూటీ ఈజ్ గాడ్) అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఆర్గనైజేషన్ నిర్వాహకులు మానేపల్లి సుబ్బారావు, వేములపల్లి వెంకటేశ్వరరావు (పెదలంక), మాజీ జెడ్పీటీసీ సభ్యులు తూనుగుంట్ల శ్రీధర్, ఉపాధ్యాయులు మేకా శ్రీసత్యరత్న, డి.లక్ష్మీపార్వతి, ఎస్ఎంసీ చైర్మన్ అత్తోట సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రోజారమణి



భట్టిప్రోలు: ఈ నెల 5వ తేదీన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2025కు మండలంలోని వెల్లటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎల్ఈ) ప్రధానోపాధ్యాయురాలు ఓలేటి రోజారమణి ఎంపికయినట్లు ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజులు బుధవారం తెలిపారు. బాపట్ల జిల్లా విద్యా శాఖ ఉత్తమ ఉపాధ్యాయులను ప్రకటించిందని, వారిలో రోజారమణి 5న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చేతుల మీదగా ఈ అవార్డును అందుకోనున్నారన్నారు. ఈ సందర్భంగా ఆమెను తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచులు, మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ పురవేదిక వద్ద స్త్రీ శక్తి పథకం విజయోత్సవ ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, ఉచిత బస్సు, మహిళలకు దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆగిన నిర్మాణం.. పట్టని యంత్రాంగం

- అంబేడ్కర్ భవన నిర్మాణానికి కూటమి గ్రహణం
- గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన పనులు
- పూర్తి చేసి వినియోగంలోకి తేవాలంటున్న దళిత సంఘాలు



అంబేడ్కర్ భవనం

రేపల్లె: అంబేడ్కర్ భవన నిర్మాణానికి కుటమి గ్రహణం పట్టింది. భవనాన్ని పూర్తిచేసి దళిత సంఘాలకు అందించేందుకు నేతలు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 90 శాతం పూర్తయిన భవన నిర్మాణ పనులను పాలకులు నిర్లక్ష్యం వహించటంతో భవనం తుది దశ పనులు నిలిచిపోయాయి. దళితుల చిరకాల స్వప్నాన్ని కూటమి ప్రభుత్వం చిదిమేస్తోందనటానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన భవన నిర్మాణ పనులు ప్రస్తుతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ భవన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చేనా అని దళితులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రూ.1.15 కోట్లు మంజూరు

తీర ప్రాంత దళితుల 30 సంవత్సరాల చిరకాల స్వప్నమైన అంబేడ్కర్ భవన నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 15 సెంట్ల స్థలం కేటాయించి విశాలమైన భవన నిర్మాణానికి రూ.1.15 కోట్ల నిధులను మంజూరు చేసింది. భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి దళితులకు కానుకగా అందించాలన్న సంకల్పంతో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి 90 శాతం పైగా పూర్తి చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ తుది దశ పనులను పూర్తిగా విస్మరించింది. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా భవనాన్ని పూర్తి చేసేందుకు ఇటు పాలకులు, అటు అధికారులు కనీసం శ్రద్ధ చూపకపోవడంతో దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

వినియోగంలోకి వస్తే ఉపయోగం

అంబేడ్కర్ భవనం వినియోగంలోకి వస్తే తీర ప్రాంతంలోని దళిత సంఘాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 30 సంవత్సరాలకు పైగా దళిత సంఘాలు ఐక్యంగా చేస్తున్న పోరాటాలకు ఫలితం లభిస్తుంది. సామాజిక వర్గంకు సంబంధించిన సభలు, సమావేశాలు, చిన్నపాటి వేడుకలు నిర్వహించుకునేందుకు చక్కటి వేదిక లభిస్తుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని దళితులు, దళిత సంఘాలు కోరుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం

అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు 90 శాతం వరకు పూర్తి అయ్యాయి. భవనంకు ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, పెయింట్స్, వాటర్ పైప్ లైనింగ్, ఇతర ఫినిషింగ్ పనులు చేయాల్సి ఉంది. వీటితో పాటు భవనం పై అంతస్తు నిర్మాణం, ఇతర సౌకర్యాలకు రూ.1.25 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరవ్వగానే పనులు ప్రారంభిస్తాం.

– చక్రవర్తి, ఏఈ, పంచాయతీరాజ్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్



మాట్లాడుతున్న ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్

చెరుకుపల్లి: వాతావరణ మార్పుల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత గత సమావేశంలో తీర్మానించిన అభివృద్ధి పనుల పురోగతి గురించి శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. ముందుగా కావూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, తాగి పడవేసిన కొబ్బరి బొండాలు నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలన్నారు. అంతే కాకుండా పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి డెంగీపై విస్తృత ప్రచారం చేస్తునట్లు సూపర్‌వైజర్ తెలిపారు.

యూరియా కొరతపై రసాభాస

మండల సర్వసభ్య సమావేశంలో ఏవో ఎండీ ఫారూక్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ సొసైటీల ద్వారా 400 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు ఎరువుల దుకాణాల ద్వారా 390 మెట్రిక్ టన్నుల యూరియా రైతలకు అందించటం జరిగిందన్నారు.

- ఇంతలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఒక్కసారిగా లేచి ఏ గ్రామంలోనూ యూరియా సక్రమంగా అందటం లేదని మండలంలోని కావూరు, గూడవల్లి, నడింపల్లి గ్రామాల్లో కొందరు పేరుగల నాయకులు ట్రాక్టర్లు, ఆటోలలో ఒక్కొక్కరు 10 నుంచి 20 కట్టలు యూరియా తీసుకుపోతున్నారని దీంతో చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులకు యూరియా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- దీనిపై ఏవో వివరణ ఇస్తూ ఎక్కడైనా ఇటువంటి పొరపాటు జరిగితే జరిగి ఉండవచ్చని మరోసారి ఇటువంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, గూడవల్లి, రాజవోలు, కావూరు గ్రామాలతో పాటు మరికొన్ని పీఏసీఎస్‌లకు కూడా ఇండెంట్ పెట్టామని ఈ వారంలో పూర్తిగా యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలపటంతో ప్రజా ప్రతినిధులు శాంతించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, డిప్యూటీ ఎంపీడీవో కేజేపీ శ్రీనివాసన్, ఎంఈవో పులి లాజర్, ఏపీఎం త్యాగరాజు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి సుమలత, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఫారూక్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీపీ వెంకట లలితకుమారి



శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ లలితకుమారి, ప్రజా ప్రతినిధులు, అధికారులు

భట్టిప్రోలు: మండల, పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పేర్కొన్నారు. బుధవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలితకుమారి మాట్లాడుతూ సచివాలయాల ఏర్పాటుతో గ్రామ స్థాయిలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఆయా డేటాలో సరైన సమాచారం పొందుపరిచి పంచాయతీల పురోగతి సూచికలో పంచాయతీలకు అవార్డులు వచ్చేలా చూడాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయబాబు మాట్లాడుతూ అన్ని శాఖలకు పంచాయతీ సూచికలో భాగస్వామ్యం ఉంటుందని, సంబంధిత డేటాలో అడిగే ఆయా ప్రశ్నలు అన్ని శాఖలకు చెందినవని, సరైన సమాధానాలు ఇస్తేనే మండల, జిల్లా స్థాయిలో ఆమోదం లభిస్తుందని చెప్పారు. పంచాయతీ సూచిక ర్యాంకుల ఆధారంగా రివార్డులు లభించడం జరుగుతుందన్నారు. శిక్షణలో మాస్టర్ ట్రైనర్లుగా వక్కలగడ్డ సురేష్, దోమా ఉదయభాస్కర్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కె.పిచ్చియ్య శాస్త్రి, ఎం.నాగబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయబాబు, కో– ఆప్షన్ మెంబర్ నబీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్ని ధర్మాలలో హిందూ ధర్మం శ్రేష్ఠమైనది



పొన్నపల్లి సత్యన్నారాయణ

భట్టిప్రోలు: ప్రపంచంలోని అన్ని ధర్మాలలో హిందూ ధర్మం శ్రేష్ఠమైనదని మండల కమిటీ సభ్యులు హిందువులలో కుల బేధాలు లేకుండా ఐక్యత సాధిస్తూ హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ బుధవారం పేర్కొన్నారు. సత్యన్నారాయణ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ వరకు ఎస్ఎస్ఎఫ్ మండల సమావేశాలు, ప్రతి నెల 6 నుంచి 10వ తేదీ లోగా గ్రామ ధార్మిక సమావేశాలు, 7న పౌర్ణమి సందర్భంగా సామూహిక హారతులు, 13న రెండవ శనివారం సత్సంగం, బాలవికాస కేంద్రాలు నెలవారీ శిక్షణ సమావేశాలు, 17న ఏకాదశి నగర సంకీర్తన, విశ్వకర్మ జయంతి, 22 నుంచి శరన్నవరాత్రుల ప్రారంభం, 29న మూల నక్షత్రం, 30న దుర్గాష్టమి, అక్టోబర్ 2న విజయదశమి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



ఖాజీపాలెం (కర్లపాలెం): ఖాజీపాలెం గ్రామంలోని కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాలలో పీజీ కెమిస్ట్రీ విభాగంలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఉప్పలపాటి విద్యామణి ఆచార్య నాగర్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ డి.రామచంద్రన్ పర్యవేక్షణలో వర్గీకరించబడిన ఔషధ మందు పదార్థాలు, ఔషధ మందు ఉత్పత్తులలో ఉన్న మలినాలను ఏకకాలంలో పరిమాణీకరణ కోసం ధ్రువీకరణ పద్ధతులు అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన విద్యామణికి కళాశాల ప్రెసిడెంట్ మంతెన నరసరాజు, కార్యదర్శి మంతెన శ్రీనివాసకుమార్, కమిటీ సభ్యులు మంతెన వెంకట శివరామరాజు, మంతెన కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఎంహెచ్‌వో డాక్టర్ యేసుబాబుకు అదనపు బాధ్యతలు



తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబుకు అసిస్టెంట్ కమిషనర్‌గా బుధవారం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచి ఆయన ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా కూడా వ్యవహరించనున్నారు.

యూరియాపై ఆందోళన వద్దు



గోవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో హేమంత్ భరత్ కుమార్

అమర్తలూరు(వేమూరు): రైతులకు యూరియా రెండు, మూడు రోజుల్లో అందించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ, యలవర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరు కూడా ఎరువుల కోసం ఆందోళన చెందవద్దన్నారు. ఎరువులు సరిపడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సొసైటీలకు యూరియా ఒకటి రెండు, రోజుల్లో వస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారులు డి.మాధవి, కె.తిరుపతమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు టి.నందిని, బి.భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

బెల్లంకొండ వెంకట్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న బెల్లంకొండ వెంకట్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య విభాగంలోని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యాంశాల్లో అత్యంత ప్రభావితం చేస్తున్న సోషల్ మీడియా యాక్టివిటీస్ శిక్షణలో తెనాలికి చెందిన ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ప్రశంసాపత్రం అందుకున్నారు. అత్యంత నాణ్యమైన విద్యాంశాలు, ఉత్తమ ఆచరణ పద్ధతులను సామాజిక మాధ్యమాల వేదికపై ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుల్లో గుంటూరుకు చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. వీరికి సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌పీడీ శ్రీనివాసరావు ప్రశంసాపత్రం, సోషల్ మీడియా పరికరాన్ని అందజేశారు. బెల్లంకొండ వెంకట్ స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో చిత్రకళ ఉపాధ్యాయుడిగా చేస్తున్నారు. ఎన్‌సీసీ అధికారిగా, గాయకుడిగా, నటుడిగా సమాజాన్ని చైతన్యపరుస్తూ విద్యార్థులను వివిధ రకాల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనేలా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

తెనాలి డిపో అభివృద్ధికి చర్యలు

డీపీటీవో సీహెచ్ విమల



డిపోను పరిశీలిస్తున్న డీపీటీవో విమల, డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ విమల పేర్కొన్నారు. తెనాలి డిపోను బుధవారం ఆమె పరిశీలించారు. ముందుగా గ్యారేజ్‌లో మొక్కలు నాటారు. అనంతరం బస్టాండ్ ఆవరణను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.36 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించేందుకు అవసరమైన అనుమతులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో తెనాలి డిపో అన్ని విషయాలలో ముందు వరుసలో ఉందన్నారు. గ్యారేజ్ విభాగంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా మహిళలకు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. తెనాలి–గుంటూరు నాన్‌స్టాప్ ఏర్పాటుపై మరోసారి సర్వే చేయిస్తామని, ఎక్కువ మంది ప్రయాణికులు కావాలని అడిగితే తప్పనిసరిగా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి బుధవారం మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడు లేత గోధుమ రంగు షర్టు, కాఫీ పొడి రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన తెనాలి జీఆర్పీ పోలీసులు రైల్లో నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని జేబులో సెల్‌ఫోన్ చార్జర్, తాళం చెవి ఉన్నాయి. షర్టు కాలర్‌పై వీనస్ టైలర్స్ లంబాడీపేట విజయవాడ అని లేబుల్ ఉంది. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.వెంకటాద్రిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

అదృశ్యమైన బాలిక తల్లికి అప్పగింత



బాలికను తల్లికి అప్పగిస్తున్న రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె: అదృశ్యమైన బాలికను తల్లికి అప్పగించినట్లు రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాలికను బుధవారం తల్లికి అప్పగించి వివరాలను వెల్లడించారు. 24వ వార్డుకు చెందిన ఆవులమంద రాములమ్మ తన కుమార్తె కరుణ కనిపించటం లేదని ఈ నెల 2వ తేదీన ఫిర్యాదు చేసిందన్నారు. కరుణ అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో చదువుతోందని, 15 రోజుల క్రితం రేపల్లెలోని ఆంధ్రరత్న స్కూలులో చేర్పించారన్నారు. మంగళవారం మధ్యాహ్నం కరుణ కనిపించకపోవటంతో ఉపాధ్యాయులు పాఠశాల పరిసరాలలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లికి సమాచారం అందించారని పేర్కొన్నారు. బాలిక తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. తమ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గాలించగా 24వ వార్డు నేతాజీనగర్‌లోని సచివాలయం వద్ద కరుణ ఆచూకీ గుర్తించామన్నారు. బాలికను విచారించి ఆమె తల్లికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. బాలికను గంటల వ్యవధిలో సీఐ ఎ.మల్లికార్జునరావు పర్యవేక్షణలో పట్టుకున్న పోలీసు బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

గర్భిణులకు అవగాహన



అమర్తలూరు(వేమూరు): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అమర్తలూరు సీడీపీవో ఎ.లక్ష్మి అన్నారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు ఎర్లీ రిజిస్ట్రేషన్ చేసుకొని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఐరన్ మాత్రలు వేసుకోవాలని, శుభ్రత పాటించాలని తెలియజేశారు. వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణులు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, లీలావతి, ఉషా, అంగన్‌వాడీ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నిమజ్జనం



కొల్లూరు : గణపతి నిమజ్జన మహోత్సవాలు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం మండలంలోని నాలుగు గ్రామాలలో ఏర్పాటు చేసిన ఐదు విగ్రహాలను కమిటీ నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. కొల్లూరు గొడపాలెం బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం, క్రాపలో ఏర్పాటు చేసిన ఏకదంతుడి ప్రతిమ, పోతర్లంకలోని గణనాథుడి విగ్రహం, గాజుల్లంకలోని రెండు మండపాలలోని లంబోదరుడి విగ్రహాలను గ్రామాలలో ఘనంగా ఊరేగింపు నిర్వహించి కృష్ణా నది, కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ పాటలు పోటాపోటీగా జరిగాయి.

ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయండి

సబ్‌కలెక్టర్ సంజనాసింహ

కొల్లిపర: స్థలాలు, పంట పొలాలు అక్రమంగా ఆక్రమించుకొన్న అక్రమణ దారులకు అధికారులు నోటీసులు జారీ చేసి, ఆక్రమణలను తొలగించాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ తహసీల్దారు జి.సిద్దార్థకు ఆదేశించారు. మండల పరిధిలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాల్లో పలుచోట్ల స్థలాలు, పంట పొలాలు ఆక్రమణలకు గురైనట్లు గ్రామస్తులు గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందజేశారు. దీంతో ఆమె బుధవారం అధికారులతో కలసి పర్యటించి అక్రమాణలకు గురైన స్థలాలను పరిశీలించి, చుట్టు ప్రక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. అక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని దావులూరులో అనధికారంగా ముగ్గురు రైతులకు 19 సెంట్ల భూమి చెముడుబాడులో 5 సెంట్ల భూమి వెబ్‌ల్యాండ్ నమోదు కావటంతో ఆ భూములను కూడా పరిశీలించి వారికి కూడా నోటీసులు జారీ చేయాలని అధికారులకు తెలిపారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దారు సిద్దార్థ, డీఎల్‌పీవో స్వరూపరాణి, సర్వేయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

జ్వరంతో యువకుడి మృతి

తూములూరు(కొల్లిపర): జ్వరంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాలు మేరకు మండలంలోని తూములూరు గ్రామంలోని గొడపాలెం కుచెందిన శొంటి సాయిరాఘవేంద్ర (25) వారం రోజుల క్రిందట తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో కొల్లిపర గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటూ ఉండగా సోమవారం ఒక్క సారిగా ఆరోగ్యం విషమించింది. వెంటనే తెనాలి జిల్లా వైద్యశాలకు తీసుకుమెళ్లాలని సిబ్బంది సూచించారు. దీంతో బంధువులు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు పోయాయి. గ్రామంలో చాలా మందికి ఇలాంటి జ్వరాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు, వైద్యులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

ఎంబీబీఎస్ గోగినేని మృతి



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం, పరిసర గ్రామాల ప్రజలకు నాలుగు దశాబ్దాలకు పైగా అతి తక్కువ వ్యయంతో ఎనలేని వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలు పొందిన గోగినేని వీర వరప్రసాద్ (85) సోమవారం మృతి చెందారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లికి చెందిన వరప్రసాద్ భట్టిప్రోలు వాసులకు ఎంబీబీఎస్‌గా సుపరిచితులు కావడం అందరికి తెలిసిన విషయమే. ఆయన 1967లో భట్టిప్రోలులో తొలిసారిగా మార్కెట్ సమీపంలోని దుర్గా పిక్చర్ ప్యాలెస్ దగ్గర వైద్య సేవలను ప్రారంభించారు. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా వైద్య సేవలు అందించి, అనంతరం వయోభారంతో విజయవాడలో స్థిరపడ్డారు. వరప్రసాద్‌కు భార్య రాజ్యలక్ష్మి, ముగ్గురు కుమారులు రంగనాయకులు, వెంకట్, రవీంద్రబాబులు ఉన్నారు. ప్రథమ, తృతీయ కుమారులు యుఎస్‌ఎలో ఉన్నారు. ద్వితీయ కుమారుడైన వెంకట్ కృష్ణా జిల్లా ఉయ్యూరులో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయన అంతిమయాత్రను గురువారం విజయవాడ మొగల్‌రాజపురం విశాలాంధ్ర రోడ్ సమీపంలోని గణేష్ కృప ట్రావెల్స్ వద్ద నుంచి నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (వేమూరు, రేపల్లె)
90109 62225 (పొన్నూరు, బాపట్ల)
Office mail : sakshigntadvt@gmail.com